క్లుప్తంగా

'బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరు'

నేరడిగొండ: బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని కాంగ్రెస్ మండల కన్వీనర్ ఎరడ్ల చంద్రశేఖర్ అన్నారు. శనివారం నాయకులతో కలిసి మండల కేంద్రంలో మాట్లాడారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వన్నెల అశోక్‌కు టిక్కెట్ దక్కడంతో సంబురాలు జరుపుకున్నారు. కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. వన్నెల అశోక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు రాం లక్ష్మణ్ గౌడ్, గడ్డం నరేశ్ రెడ్డి, బుక రాములు, వినాయక రెడ్డి, చౌహాన్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి



అధికారులతో సమావేశమైన జడ్జి హుస్సేన్

బోథ్: డిసెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి. హుస్సేన్ అన్నారు. శనివారం బోథ్ కోర్టు పరిధిలోని పోలీసు, అటవీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్ ఎస్సైలు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్‌తోనే బడుగుల అభివృద్ధి



నినాదాలు చేస్తున్న డీఎస్పీ నాయకులు

బోథ్: ధర్మసమాజ్ అధికారంలోకి వస్తేనే బడుగుల అభివృద్ధి జరుగుతుందని నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ప్రముఖ రాజకీయ పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు టికెట్ కేటాయింపులో అన్యాయం చేశారని మండిపడ్డారు. ప్రతిఒక్కరూ ధర్మసమాజ్ పార్టీని ఆదరించాలన్నారు. బోథ్ అభ్యర్థి ఉయికె ఉమేష్, ప్రచార కమిటీ అధ్యక్షుడు దర్శనాల అశోక్, కొండమడుగు గణేష్, వెంకటేశ్, రమేశ్, బడుగు రాజేశ్వర్, శేఖర్, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

అమృత కలశాలతో ఢిల్లీకి వెళ్లిన యువకులు

బోథ్: మేరీమట్టి.. మేరాదేశ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సేకరించిన అమృత కలశాలను బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్, యువతీ, యువకులు ఢిల్లీకి తీసుకెళ్లారు. శనివారం రైలులో బయలుదేరారు. ఈనెల 30న అమరవీరుల స్మారకార్థం వంద ఎకరాల్లో నిర్మించబోయే స్మృతి వనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థికి ఘన స్వాగతం

ఇంద్రవెల్లి: ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెడ్మా భొజ్జు పటేల్‌ను ప్రకటించడంతో ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆదివాసీలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ముందుగా రాంజీగోండ్, కుమురం భీం స్మారక జెండాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమసే వెంకట్‌రావ్, మెస్రం నాగ్‌నాథ్, ముఖడే ఉత్తం, మహ్మద్ జహీర్, మానిక్‌రావ్ పాల్గొన్నారు.

సంస్కృతిని అలవర్చుకోవాలి

నేరడిగొండ: మన దేశ సంస్కృతి, కట్టుబాట్లను అలవర్చుకోవాలని హిందూ సంస్థ సభ్యుడు, సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. ఏకల్ అభియాన్ బోథ్ సంచ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని శబరిమాతా ఆశ్రమంలో సమావేశం నిర్వహించారు. హిందూ ధర్మం చాలా ప్రాచీనమైందని, హిందూ పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో హిందూ సంస్థల సభ్యులు రాథోడ్ రాజశేఖర్, బాశ్రే శేఖర్, పట్టు మహేందర్, మాధవ్, నరేశ్, ఆచార్య, మాతాజీ పాల్గొన్నారు.

'బోథ్‌పై బీఆర్‌ఎస్‌ది సవతి ప్రేమ'

బోథ్: బోథ్‌పై బీఆర్‌ఎస్ సవతి ప్రేమ చూపిస్తోందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ మైనార్టీ జనరల్ సెక్రటరీ షేక్‌నాసర్ అహ్మద్ అన్నారు. బోథ్‌ను డివిజన్‌గా చేయాలని 87 రోజుల పాటు దీక్షలు చేసినా.. పట్టించుకోవడం లేదన్నారు. డివిజన్ కోసం సీఎం కేసీఆర్‌ను ఒప్పించడంలో నాయకులు విఫలమయ్యారని ఆరోపించారు.

ఇస్మార్ట్ ట్రెండ్





ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లపై మక్కువ చూపని యువత ఉండదు. ఎవరి చేతిలో చూసినా స్మార్ట్ ఫోన్ ఉండాల్సిందే. దానికి అనుబంధంగా అనేక గ్యాడ్జెట్స్ అందుబాటులోకి వచ్చాయి. ఈపరికరాల కొనుగోలు కోసం యువత ఆసక్తిని కనబరుస్తుంటారు. యువత ఫేవరెట్ లిస్టులో మరో గ్యాడ్జెట్ వచ్చి చేరిపోయింది. అదే స్మార్ట్ వాచ్. ఎవరి చేతికి చూసినా స్మార్ట్ వాచ్ దర్శనమిస్తోంది. ఒకప్పుడు కేవలం సమయానికి మాత్రమే పరిమితమైన గడియారాలు నేడు సాంకేతికతను అందిపుచ్చుకొని యువతను ఆకర్షిస్తున్నాయి.

– ఆదిలాబాద్

- యువతలో స్మార్ట్‌వాచ్‌ల క్రేజ్
- ఫ్యాషన్‌తో పాటు ఫిట్‌నెస్ కోసం వినియోగం

టైమ్ చూడొచ్చు.. కాల్స్ చేయొచ్చు..

స్మార్ట్‌వాచ్‌లో సమయంతో పాటు పలు అప్లికేషన్లను డౌన్లోడ్ చేసుకోవచ్చు. మన స్మార్ట్‌ఫోన్‌కు అనుబంధంగా దీన్ని అనుసంధానం చేసుకొని కాల్స్ కూడా మాట్లావచ్చు. వాట్సప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా అప్లికేషన్లను సైతం చూసే వెసులుబాటు ఉంటుంది. మొబైల్ ఓపెన్ చేయకుండానే స్మార్ట్‌వాచ్‌ల ద్వారా సోషల్ మీడియా అప్లికేషన్లు చూడవచ్చు. అంతేకాకుండా యువత వివిధ యాప్‌ల ద్వారా సంగీతాన్ని వింటూ ఎంజాయ్ చేస్తున్నారు.



స్మార్ట్‌వాచ్‌లు

హెల్త్ మానిటర్..

స్మార్ట్‌వాచ్‌లలో ఆరోగ్యాన్ని గురించి ఎప్పటికప్పుడు తెలియజేసే ఫీచర్స్ అందుబాటులోకి వచ్చాయి. శరీరంలోని బీపీ, హార్ట్‌బీట్, ఆక్సిజన్ పర్సంటేజ్ వంటి వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంది. అంతేకాకుండా ఎంతసేపు నిద్రపోయాము, ఎంతసేపు గాఢ నిద్రలో ఉన్నాము, నిద్రలేమి వంటి వివరాలను కూడా రికార్డ్ చేస్తుంది. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, బ్రీతింగ్, యోగా వంటి విషయాలను మానిటర్ చేసే ఫీచర్స్ సైతం స్మార్ట్‌వాచ్‌లో ఉంది. దీంతో స్మార్ట్‌వాచ్‌లకు గిరాకీ పెరిగింది. నాణ్యతను బట్టి రూ. 1500 నుంచి రూ. 20 వేల వరకు లభ్యమవుతున్నాయి.

'బీజేపీతోనే బీసీలకు న్యాయం'



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీజేపీ అధికారంలోకి వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందని ఆదిలాబాద్ బీజేపీ అభ్యర్థి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. శనివారం శాంతినగర్ కాలనీలో సంబురాలు జరుపుకున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో పేదలకు న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అవినీతి, కుటుంబపాలను అంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఎమ్మెల్సీ ప్రవీణ్, నాయకులు ఆదినాథ్, విజయ్ బోయర్, మయూర్ చంద్ర, లోక ప్రవీణ్ రెడ్డి, సంతోష్, రాందాస్, ముకుంద్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ అన్నివర్గాలకు అన్యాయం చేసిందని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ ఆరోపించారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాలుగుసార్లు ఎమ్మెగా గెలిచిన జోగు రామన్న ఎలాంటి అభివృద్ధి చేయాలేదని మండిపడ్డారు. అడుగడుగునా ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి

ఉట్నూర్‌రూరల్: బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని బీజేపీ నాయకులు అన్నారు. సూర్యపేట బహిరంగ సభలో కేంద్ర హోంశాఖ మంత్రి బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడంతో నాయకులు శనివారం సంబురాలు జరుపుకున్నారు. ఉట్నూర్ ఐబీచౌరస్తాలో ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో శ్రీరాం నాయక్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, రాజశేఖర్, బింగి వెంకటేశ్, భాగ్యలక్ష్మి, భగీర్థ, రాంచందర్, లింగాగౌడ్, సతీశ్, దేవిదసా లింగన్న, హరిప్రసాద్, రవిచందర్ పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బోథ్: యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రిజర్వేషన్లు అమలు చేయాలని యాదవ సంఘం బోథ్ నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు సురేందర్‌యాదవ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి హరీష్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ యాదవ్, అనిల్‌యాదవ్, వేణుగోపాల్ యాదవ్, గోవర్ధన్, నాగయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇచ్చోడ: అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే బీఆర్‌ఎస్ ఉద్దేశమని ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోకస్మన్నూర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు, రైతుబంధు పెంచనున్నట్లు పేర్కొన్నారు. బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్‌జాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహరాజ్ అహ్మద్, గాడ్గే సుభాష్, కృష్ణకుమార్, హరన్ సుభాష్‌పటేల్, శీరిష్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అజీం, నరాల శ్రీనివాస్, కాండ్లి రమణయ్య, పట్ల సోమన్న, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అనిల్ జాదవ్‌ను గెలిపించాలి

బోథ్: బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. శనివారం సొనాలలో ప్రచారం నిర్వహించారు. ఇక్కడి ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సొనాలను మండలంగా ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, అల్లకొండ ప్రశాంత్, భూమన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు. బోథ్ పట్టణంలో జెడ్పీటీసీ సంధ్యారాణి ఎన్నికల ప్రచారం చేశారు.

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శనివారం తేజాపూర్, బుద్ధికొండ గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ రైతుల నడ్డివిరిచేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, జహీర్, ఏలేటి రవీందర్ రెడ్డి, సరసాని మహేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, సాబ్లే నానక్‌సింగ్, ప్రతాప్ సింగ్, కమలాకర్ రెడ్డి పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి'



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

గుడిహత్నూర్: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్‌గౌడ్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. మూడోసారి కేసీఆర్‌ని ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావ్ కేంద్రే, గజానంద్ గిత్తే, రమేశ్ జాదవ్, మాధవ్ కేంద్రే, రావణ్ ముండే పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారభం

తలమడుగు: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్ శనివారం ప్రారంభించారు. అలాగే ప్రచార రథానికి తలమడుగు వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో బోథ్ బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, ఎంపీటీసీ చంటి, శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, అభిరాంరెడ్డి, ప్రకాష్, గంగాధర్, మున్న, ప్రశాంత్, యసం రవి, చందు, రాజు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యే టికెట్

- ఆదిలాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసరెడ్డి



శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న కార్యకర్తలు

కైలాస్‌నగర్: ప్రజలందరి ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యే టికెట్ వచ్చిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జోగు రామన్న అన్యాయాన్ని, అహంకారాన్ని అణివేయాలంటే అందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. కాంగ్రెస్ బలం, బలగం ముందు బీఆర్‌ఎస్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయన్నారు. ప్రజలకు సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, సంతోష్‌రావు, కృష్ణారెడ్డి, షకీల్, రవి, శంకర్, మీరాబాయి, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

బజార్‌హత్నూర్: బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా వన్నెల అశోక్‌ను ప్రకటించడంతో శనివారం మండల కేంద్రంలో జెడ్పీటీసీ మల్లె పూల నర్సయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జల్కె పాండురంగ్, బాల రవి, ఇర్ల శివుడు, సూర్యవంశీ పాండు, విఠల్, రాజు, దినేష్, కిషన్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా వన్నెల అశోక్‌ను ప్రకటించడంతో మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బస్టాండ్ వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచారు. అశోక్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అంకతి రవీందర్, ముస్తఫా, చట్ల మహేందర్, కొల్లూరి వినోద్, మాధవ్ మస్కే, వసీంఖాన్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: కాంగ్రెస్ టికెట్‌ను వన్నెల అశోక్‌కు కేటాయించడంతో శనివారం నాయకులు కార్యకర్తలు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్‌లో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్నెల అశోక్‌ను గెలిపించుకుంటాం

బోథ్: బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిగా వన్నెల అశోక్‌ను అధిష్టానం ప్రకటించిందని, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని పట్టణ అధ్యక్షుడు సల్ల రవి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నారు. త్వరలోనే ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామన్నారు.

'ఉచిత హామీలు నమ్మి మోసపోవద్దు'



ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్‌బాయి

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్ ఉచిత హామీలను నమ్మి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్‌బాయి అన్నారు. శనివారం మండలంలోని సాకరం తండా, జైత్రంతండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, రాథోడ్ భీంరావ్, దిలీప్ మోరే, బాలే సునీల్, మాస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

ముగిసిన 'వర్షవాస్'

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ బుద్ధవిహార్‌లో జూలై 3న ప్రారంభించిన వర్షవాస్ కార్యక్రమం శనివారం ముగిసింది. నాలుగు నెలల పాటు బుద్ధ భిక్షులు కాంరాజ్ వాగ్మారే ఆధ్వర్యంలో ప్రతిరోజు బుద్ధ, ధమ్మ గ్రంథం, అంబేద్కర్ చరిత్రను బోధించారు. ముగింపు రోజు మిలింద్‌నగర్ బుద్ధ విహార్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, మస్కే రాజువర్ధన్, బుద్ధ ఉపాసికులు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేద్దాం

- ఘనంగా కుమురం భీం వర్ధంతి



ఇచ్చోడ: నివాళులర్పిస్తున్న ఆదివాసీ నాయకులు



ఇంద్రవెల్లి: నినాదాలు చేస్తున్న ఆదివాసీలు



ఎదులాపురం: నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: కుమురం భీం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఎదుట భీం విగ్రహ ప్రతిష్ఠాపన స్థలంలో వర్ధంతిని నిర్వహించారు. కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరెంగా గాంధారి, ఆదివాసీ నాయకులు ఆర్క ఖమ్ము, మెస్రం నాగ్‌నాథ్, కోట్నాక్ భారీక్, గోండ్‌గూడ పటేల్ మడావి ఇంద్రు, చహకటి నాగోరావ్, జుగ్నాక్ భారత్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: కుమురం భీం స్ఫూర్తిని కొనసాగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ అన్నారు. శనివారం కుమురం భీం వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం మహేందర్, సిడం మురళి, జంగు, మడవి భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా కుమురం భీం శనివారం ఘనంగా నిర్వహించారు. బోథ్, పొచ్చర, పట్నాపూర్, సొనాలతో పాటు ఆదివాసీ గ్రామాల్లో భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్నాపూర్‌లో సార్మెడి ఆడెం భీంరావ్, తొడసం కైలాస్, నీలకాంత్ రావ్, ఆత్రం దేవ్‌రావు, కైలాస్, పొచ్చరలో ఎంపీటీసీ రాజమణి, మహిపాల్, కుడాల స్వామి, సంజీవ్, సంఘం సభ్యులు, సొనాలలో పార్డి (బి) సర్పంచ్ జుగ్నక్ మారుతి, కోవ కిసాన్, సిడం భగవంత్‌రావ్, పంద్రం గంగాధర్, ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, సార్మెడి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులను కాపాడాలి

ఎదులాపురం: ఆదివాసీ హక్కులను కాపాడి, ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. కుమురం భీం వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో భీం విగ్రహానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్‌తో కలిసి నివాళులర్పించారు. నాయకులు రమాకాంత్, రమేశ్, సిడాం రాం కిషన్ పాల్గొన్నారు.

సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో..

సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో శనివారం భీం వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్ సింగ్, వామన్, సురేశ్, నితిన్, బుచ్చిరాం, జంగుబాయి, వర్షాబాయి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: కుమురం భీం వర్ధంతిని శనివారం ఆదివాసీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదిమ గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు ఉయికే విఠల్, రిటైర్డ్ ఏఎస్పీ సెడ్మకి గోద్రులు మాట్లాడుతూ.. భీం ఆశయ సాధనకు పాటుపడాలన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీంను స్ఫూర్తి తీసుకొని ఆదివాసీల హక్కుల సాధన కోసం ఉద్యమించాలన్నారు.

తాంసి: మండలంలోని అంబుగాం గ్రామంలో భీం వర్ధంతిని నిర్వహించారు. భీం విగ్రహానికి ఆదివాసీలు నివాళులర్పించారు. జెడ్పీటీసీ రాజు, సర్పంచ్ ఆత్రం తుర్పాబాయి, ఉప సర్పంచ్ పోచ్చన్న, మల్కు పటేల్, ఆత్రం భారత్, సంతోష్, కృష్ణ, రామన్నయాదవ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. స్థానిక కేబీ ప్రాంగణంలోని భీం విగ్రహం వద్ద పూజలు చేసి, నివాళులర్పించారు. నాయకులు దుర్గు, ఆనంద్‌రావు, హన్మంత్‌రావు, చంద్రభాన్, తిరుపతి, దేవారావు, భగవంత్‌రావు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థిని హత్య!

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ విద్యార్థిని హత్యకు గురైన సంఘటన శనివారం రాత్రి ఉట్నూర్ మండలం దొంగచింత గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. ఉట్నూర్ మండలం దొంగచింత పంచాయతీ పరిధి లోని భీంజీగూడకు చెందిన తొడసం గుణవంత్‌రావు, లక్ష్మీబాయిల సంతానమైన తొడసం కమల(16) ఉట్నూర్‌లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. దసరా సెలవుల్లో భాగంగా ఇంటి వద్దే ఉన్న ఆమె, తమ చేనులో పంట కాపలకు వెళ్తోంది. రోజు మాదిరిగానే వెళ్లిన ఆమె శనివారం సాయంత్రమైనా, ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. విషయాన్ని కుటుంబీకులు స్థానికులకు చెప్పి గాలించారు. పంట చేనులో ఆనుకొని ఉన్న పొదల్లో ఆమె శవం కనిపించింది. శవంపై గాయాలు ఉండటంతో, ఎవరో హత్య చేసి ఉంటారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.